క్లుప్తంగా

స్వచ్ఛందంగా రక్తదానం



వనపర్తి క్రైం: బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కుల వ్యవక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో రక్తనిధి కేంద్రంలో 31 మంది రక్తదానం చేశారు. ఈకార్యక్రమానికి హాజరైన డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ రక్తదానం అన్నింటి కన్నా గొప్ప దానమని, ప్రాణపాయ స్థితిలో రక్తం ఎంతో ముఖ్యమైనదన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, గంధం భగత్, వెంకట్‌రాములు తదితరులు ఉన్నారు.

వసతులు కల్పించాలి



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని గురువారం కలెక్టర్ నందులాల్ పవర్‌కు తెలంగాణ ప్రజల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్‌గుప్త వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు కంపౌండ్ వాల్ లేకవడంతో విష పురుగులు, పందులు, కుక్కలతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే పాత భవనాలు కూలిపోయేందుకు ఉన్నాయని, వాటిని వెంటనే తొలగించి సమస్యలు పరిష్కరించాలని జిల్లా అధికారులకు, కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంజనేయులు, రాజకుమార్, మహేష్, రాజేష్, సిద్దుసాయి, అక్షర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



అమరచింత: ఏప్రిల్ 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం ఆత్మకూర్ ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలను అరికడదాం – జాతీయ సంపదను పెంపొదిద్దాం అని పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో అగ్ని ప్రమాదాలను ఎలా అరికట్టాలనే విషయాలతో పాటు తమ సిబ్బంది ఎలా ప్రమాదాలను నివారిస్తారో అన్న విషయలను ప్రదర్శిస్తారని తెలిపారు. చుట్టు పక్కల ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరిగిన వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫైర్‌సిబ్బంది నరేష్‌గౌడ్, సందీప్‌రెడ్డి, నరసింహారెడ్డి, భానుచందర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందించాలి



వనపర్తి క్రైం: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించాలని రాష్ట్ర ఫుడ్ కమీషన్ సభ్యులు కొంతం గోవర్ధన్‌రెడ్డి సూచించారు. గురువారం మండలంలోని సవాయిగూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా రక్తహీనతతో బాధపడుతున్న మహిళలు, చిన్నారుల పట్ల అత్యంత శ్రద్ధ వహించాలన్నారు. నిరంతరం సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలని, కోడి గుడ్డు 50గ్రాములు ఉండాలని ఆదేశించారు. లేనిచో కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీడీపీఓను ఆయన ఆదేశించారు.

బుద్దారం గండి సమీపంలో రోడ్డు ప్రమాదం

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గండి సమీపంలో గురువారం రాత్రి ఎనిమిది గంటల సమయంతో ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడడంతో వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఏడుట్లకు చెందిన వెంకటేష్ హైదరాబాద్ నుంచి సొంత గ్రామానికి వెళ్తుండగా బుద్దారం గండి సమీపంలో బైకు అదుపు తప్పి కిందపడిపోయింది. దీంతో వెంకటేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గుర్తించిన స్థానికులు అతడిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. రోడ్ పనులు కొనసాగుతుండగా.. అక్కడ ఎటువంటి సూచిక బోర్డులు లేకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

వేతనాలు అందేనా?

- ఐకేపీ వీఓఏలకు 6 నెలలుగా అందని జీతం
- ధర్నా, సమ్మెలు చేసినా స్పందించని వైనం
- డిమాండ్లు పరిష్కరించకుంటే 17 నుంచి నిరవధిక సమ్మె



పాన్‌గల్‌లో డిమాండ్ల సాధనకు ధర్నా చేస్తున్న వీఓఏలు (ఫైల్)

పాన్‌గల్: ఐకేపీ (సెర్ప్) సంస్థలో 20ఏళ్లుగా గ్రామీణ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న గ్రామ సహాయకులు(వీఓఏ) చాలీచాలని వేతనాలతో కాలం వెళ్లదీస్తున్నారు. ఇచ్చే వేతనాలు కూడా రెగ్యులర్‌గా అందక నానా అవస్థలు పడుతున్నారు. నెలనెలకు ఇచ్చే రూ. 3,900 వేతనం కూడా ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉండటంతో ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

మండల ఐకేపీలో ఆయా గ్రామాల సంఘాలను బట్టి మండలంలో మొత్తం 34 మంది వీఓఏలు పనిచేస్తున్నారు. గ్రామీణ స్థాయిలో మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి వీరంతా ఎంతో కృషి చేస్తున్నారు. గ్రామ సంఘం సభ్యులకు అన్ని రకాల రుణాలు ఇప్పించడం, తిరిగి బ్యాంకులకు సక్రమంగా రుణాలు చెల్లించేలా వారిని చైతన్యం చేయడం వంటి కీలకమైన పనులు చేస్తున్నా.. వారికి నెలవారీగా వేతనాలు అందట్లేదు

గ్రేడింగ్‌ల పేరుతో..

వీఓఏలుగా పనిచేస్తున్న వారికి సంఘాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు, రుణాలు చెల్లింపుల విషయంలో గ్రేడింగ్‌లు కేటాయిస్తూ ఏ, బీ, సీ గ్రేడ్‌లు ఉన్న వీఓలకు వేతనాలు ఇస్తూ.. మిగతా గ్రేడ్‌లు వచ్చే వారికి వేతనాలను నిలిపివేస్తున్నారు. దీంతో గ్రేడింగ్‌ల విధానం రద్దు చేస్తూ పనిచేసే వారికి రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వాలని వీఓఏలు కోరుతున్నారు.

నిరవధిక సమ్మె పలుపు

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు నిర్ణయించి అమలు చేయాలని, యూనిఫాం, ఐడీ కార్డులు, రూ.10 లక్షలు ఆరోగ్య బీమా కల్పించాలని, ప్రతి గ్రామ సంఘానికి పక్కా భవనం ఉండాలనే డిమాండ్లను ప్రభుత్వం ఈనెల 16వ తేదీ వరకు పరిష్కారం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఈనెల 17వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేయనున్నట్లు వీఓఏల సంఘం నాయకులు పేర్కొంటున్నారు.

గ్రేడింగ్ విధానం రద్దు చేయాలి



వీఓఏగా పనిచేస్తున్న వారికి గ్రేడింగ్ విధానం రద్దు చేసి, రెగ్యులర్‌గా వేతనాలు అందించాలి. సంఘాలు, సభ్యుల ఆర్థిక బలోపేతానికి గ్రామ స్థాయిలో పనిచేస్తున్న వీఓఏలు గ్రేడింగ్ విధానంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇచ్చే చాలీచాలని వేతనం రెగ్యులర్‌గా అందిస్తూ ఇచ్చే వేతనాలను పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి.

– గోవర్ధన్‌రెడ్డి, వీఓఏ, బహదూర్‌గూడెం

సమ్మె తప్పదు



వీఓఏలకు సంబంధించిన డిమాండ్లను ఈనెల 16వ తేదీ వరకు ప్రభుత్వం పరిష్కరించకుంటే 17వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తాం. గ్రామీణ స్థాయిలో సంఘాల బలోపేతానికి ఎంతో కృషి చేస్తున్నా వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడంతో కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికైన ప్రభుత్వం స్పందించి మా డిమాండ్లను పరిష్కరించాలి

– రాజయ్యగౌడ్, వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు

ఖాతాల్లో జమ చేస్తాం

ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏల వేతనాలు మంజూరైన వెంటనే వారి ఖాతాల్లో జమ చేస్తాం. వీఓఏల వేతనాలు గతేడాది అక్టోబర్ నుంచి పెండింగ్‌లో ఉన్నాయి. వాటిలో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ 3 నెలలకు సంబంధించిన వేతనాలు మంజూరు అయ్యాయి. వాటిని బ్యాంకుకు పంపిస్తాం. వీఓఏలుగా పనిచేస్తున్న వారిలో ఏ, బీ, సీ గ్రేడ్‌లు ఉన్న వారికే వేతనాలు ఆపై గ్రేడులు ఉన్న వారికి వేతనాలు నిలిపి వేశారు.

– బాషానాయక్, ఐకేపీ డీపీఎం, వనపర్తి

కంటివెలుగు, క్షయపై కళాజాతా



కంటివెలుగు, క్షయపై కళాజాతా నిర్వహిస్తున్న కళాకారులు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో కలెక్టర్ ఆదేశానుసారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం వారిచే గురువారం కంటివెలుగు, క్షయవ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. కంటి సమస్యలు ఉన్న వారు, 18ఏళ్ల పైబడిన వారందరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని, రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం, త్వరగా అలిసిపోవడం వంటి లక్షణాలు ఉన్న వారు తెమడ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా 6 నెలలు మందులు వాడితే క్షయ వ్యాధిని నివారించవచ్చని కళాకారులు ఆట, పాటల ద్వారా అవగాహన కల్పించారు. క్షయ వ్యాధికి మందులు వాడుతున్న వారికి పోషణ నిమిత్తం 'నిక్షయ పోషణ అభియాన్' కింద నెలకు రూ.500 ప్రభుత్వం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా టీబీ అధికారులు బాసిత్, నగేష్, ప్రవీణ్, సర్పంచ్ రాణి, పంచాయతీ కార్యదర్శి స్వాతి, కంటి వెలుగు వైద్యాధికారి డా.మమత, వైద్య సిబ్బంది శ్రీనివాసులు, రాంచందర్, సుమనశ్రీ, నర్సమ్మ, కళాకారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేసే అర్హత కేసీఆర్‌కు లేదు



వనపర్తిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

వనపర్తి క్రైం: దళితులను మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేసే అర్హత లేదని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ బోసుపల్లి ప్రతాప్ అన్నారు. గురువారం బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దళితులను సీఎం చేస్తానని, మూడెకరాల భూమి ఇస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్ ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.కృష్ణ, సబ్బిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు నారాయణ, రామన్‌గౌడ్, నాయకులు కుమారస్వామి, ఆర్.వెంకటేశ్వర్ రెడ్డి ఉన్నారు.

ఖిల్లాఘనపురం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేదని మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి శివశంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఎన్నికల సమయం వచ్చే సరికి ముఖ్యమంత్రికి దళితులు గుర్తుకు వస్తారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఆశన్న, మండల ప్రధాన కార్యదర్శి అంజనేయులు, ఉపాధ్యక్షుడు రాంచంద్రి, బండారి శ్రీను పాల్గొన్నారు.

రైతాంగ పోరాటంలో ఏఐకేఎస్ పాత్ర చారిత్రాత్మకమైనది



మాట్లాడుతున్న బాల్‌రెడ్డి

పాన్‌గల్: రైతాంగ పోరాటంలో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) పాత్ర చారిత్రాత్మకమైనదని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తెల్లరాళ్లపల్లితండాలో ఏఐకేఎస్ 88వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సమస్యల పరిష్కారం కోసం 1936లోనే ఏఐకేఎస్ ఏర్పడిందన్నారు. ఓ పక్క రైతాంగ సమస్యలపై, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చేసిన ఘనత ఏఐకేఎస్‌కు ఉందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన రైతు వ్యతిరేక చట్టాలపై జరిగిన పోరాటంలో ఏఐకేఎస్ కీలక పాత్ర పోషించదని గుర్తుచేశారు. పార్లమెంటులో రైతుకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా చట్టం తీసుకరావాలని, విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుందన్నారు. ప్రజలు ఇందులో భాగస్వాములు అవుతూ సమస్యల సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రైతాంగ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు అమరవీరుల ఆశయాల కనుగుణంగా ఏఐకేఎస్ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బాబునాయక్, సింగిల్ విండో డైరెక్టర్ వాల్యానాయక్, రైతులు పాల్గొన్నారు.

కవి సమ్మేళనం



వనపర్తిటౌన్: డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గురువారం రాత్రి జిల్లాకేంద్రంలోని గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ బి.లక్ష్మయ్య ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేటితరం యువత కవితల గొప్పతనాన్ని గుర్తించాలన్నారు. అనంతరం కవులు బైరోజు చంద్రశేఖర్, నారాయణరెడ్డి, శంకర్‌గౌడ్, సత్తార్, సుజాతమ్మ, చెన్నపద్మ, వీరాచారి, జనజ్వాలను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో గ్రంథాలయసంస్థ సభ్యుడు రమేష్, లైబ్రేరియన్ శ్రీనివాసులు, వెంకటేశ్వరమ్మ, చైతన్య, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయండి

పాన్‌గల్: భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గంధం లక్ష్మయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట జయంతికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు, ఆలోచనలు భవిష్యత్ తరాలకు తెలియపరుస్తూ ఆయన అడుగు జాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచులు గోపాల్‌రెడ్డి, జయరాములుసాగర్, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కదిలిరావాలని మహానీయుల ఉత్సవ కమిటీ జిల్లా కన్వీనర్ గంధం లక్ష్మయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజనగరం రాజేష్ మాదిగ అన్నారు. ఉత్సవాల వాల్ పోస్టర్‌ను శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండు వద్ద మహానీయుల కమిటీ కో కన్వీనర్ రవిప్రసాద్ మాదిగ, స్టూడెంట్ ఫెడరేషన్ జిల్లా నాయకులు చెన్న కేశవులు మాదిగ, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు గౌరిపాగ లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు రాముడు తదితరులతో కలిసి విడుదల చేశారు. కార్యక్రమంలో తిరుపతయ్య, రాముడు, రాంచందర్, కర్ణన్న, అంజనేయులు, మహేందర్ ఉన్నారు.



ముస్లింలకు రంజాన్ కానుకల పంపిణీ



గోపాల్‌పేటలో ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేస్తున్న నాయకులు, అధికారులు

అమరచింత: రంజాన్ మాసంలో పవిత్ర ఉపవాస దీక్షా చేపట్టిన ముస్లింలకు సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు రాబర్ట్ గురువారం అమరచింత జామీయా మసీదులో పండ్లు పంపిణీ చేశారు. ఈమేరకు రాబర్ట్ మాట్లాడుతూ దేశంలో కులమాతాలకు తావు లేదని, భిన్నత్వంలో ఏకత్వం అని దేశ ప్రజలు చాటి చెప్తున్నారన్నారు. కార్యక్రమంలో మౌలానా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల్‌పేట: రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ పంపిన రంజాన్ తోఫాను గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ముస్లింలకు ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ భార్గవి, రైతుబంధు అధ్యక్షుడు తిరుపతియాదవ్ పంపిణీ చేశారు. గోపాల్‌పేట మండల కేంద్రంతో పాటు తాడిపర్తి, పొలికెపాడు, బుద్దారం, ఏదుల గ్రామాలకు పంపినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఆర్ఐ యాదయ్య, ఎంపీడీఓ ఉసేనప్ప, నాయకులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు అందిస్తున్న రంజాన్ కానుకను శుక్రవారం మండల కేంద్రంలోని మజీద్ వద్ద పంపిణీ చేశారు. ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పరమేశ్వర్, కురుమూర్తి, ఖిల్లాఘనపురం సర్పంచ్ వెంకటరమణ, ఉప సర్పంచు యాదగిరి, నాయకులు వెంకటేష్ ముస్లింలకు కానుకలను పంచారు. మండలంలో మొత్తం 150 మందికి ప్రభుత్వం నుంచి కానుకలు వచ్చాయని ఇన్‌చార్జ్ తహసీల్దార్ తెలిపారు.



అమరచింతలో..



ఖిల్లాఘనపురంలో..

'స్థాయి మరిచి విమర్శలు చేయొద్దు'



మాట్లాడుతున్న జూపల్లి వర్గీయులు

పాన్‌గల్: గ్రామ స్థాయిలో వార్డు సభ్యులుగా కూడా గెలువలేని వారు స్థాయికి మించి మాజీ మంత్రి జూపల్లిపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని జూపల్లి వర్గీయులు మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రవికుమార్, మాందాపూర్ సర్పంచ్ జయరాములుసాగర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో వారు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 2018 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారు ఇప్పుడు జూపల్లిని విమర్శిస్తూ ఉద్యమకారుల గురించి మాట్లాడుతన్నారని ఎద్దేవా చేశారు. అధికార పార్టీ నాయకులు సంస్కారంగా మాట్లాడం నేర్చుకోవాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎవరు కృషి చేశారు, ఎవరు ఉద్యమాలు చేశారు అనే విషయాలు నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారన్నారు. అధికార పార్టీ నాయకుల అహంకారం, ధన దోపిడి, భూ కబ్జాల గురించి ప్రజలకు తెలుసని, వచ్చే ఎన్నికల్లో మద్దతు ఎవరికి ఉంటుందో ప్రజా తీర్పుతో తెలుస్తుందన్నారు. జూపల్లిపై అనవసర ఆరోపణలు, విమర్శలు చేస్తే సహించేది లేదని అధికార పార్టీ నేతలను హెచ్చరించారు. సమావేశంలో నాయకులు దశరథం, రేక్యానాయక్, గోపాల్, రాంచందర్, దర్గయ్య, ప్రేమ్‌నాయక్ పాల్గొన్నారు.

ఆయుష్ వైద్య విధానంపై అవగాహన



కొత్తకోటలో..



పెబ్బేరులో విద్యార్థులకు రాగి లడ్లు పంపిణీ చేస్తున్న ఆయుష్ ఆరోగ్య వైద్యులు

కొత్తకోట: ఆయుష్ విభాగం వారి ఆధ్వర్యంలో గురువారం పట్టణ కేంద్రంలోని స్థానిక బాలికల ఉన్నత పాఠశాల, అమడబాకుల కేజీబీవీల్లో హోమియోపతి వైద్యురాలు మంజుశ్రీ చేతుల మీదుగా రాగి లడ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికల ఎదుగుదలకు రాగి లడ్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆరోగ్యం పట్ల విద్యార్థినులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజులత, శిరీష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆయుష్ హోమియో ఆస్పత్రి వైద్యాధికారి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆయుష్ కిట్టు, ఆరోగ్య కర దీపిక, రాగి లడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగనిరోధక శక్తి పెరిగేందుకు చిరుధాన్యాలు ఎంతో ఉపయోగపడుతాయని, ఆయుష్ సేవల్లో వివిధ రకాల ఆరోగ్య సమస్యలను తగ్గించేందుకు సహాయపడతాయన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్య విషయాల్లో శ్రద్ధ వహించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ బాలభారతి, ఫార్మసిస్ట్ గోపాల్‌గౌడ్, రాములు, పాఠశాల ప్రత్యేకాధికారి పద్మారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిలో కార్యదర్శుల పాత్ర కీలకం



కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ తదితరులు

ఖిల్లాఘనపురం: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర ఎంతో కీలకమని ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, ఎంపీడీఓ విజయ్‌కుమార్ అన్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పదవీ బాధ్యతలు చేపట్టి ప్రొహిబిషన్ పీరియడ్ నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో కేక్ కట్‌చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి విషయంలో సర్పంచ్‌లతో మమేకమై ముందుకు సాగాలన్నారు. అనంతరం మంత్రి నిరంజన్‌రెడ్డి సహాయంతో ప్రభుత్వం దృష్టికి తమ రెగ్యులరైజ్ విషయాన్ని తీసుకెళ్లాలని పంచాయతీ కార్యదర్శులు వారికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీఓ రాజు, ఏపీఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'చలో అచ్చంపేట' వాల్‌పోస్టర్ల విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న నిఖిత న్యాయ జేఏసీ సభ్యులు

చిన్నంబావి: నాగర్‌కర్నూల్ జిల్లా మున్ననూరు గురుకుల పాఠశాలలో మార్చి 6న అనుమానస్పదంగా చనిపోయిన 6వ తరగతి విద్యార్థిని నిఖిత మృతికి నిరసనగా గురువారం చిన్నంబావి మండల కేంద్రంలో చలో అచ్చంపేట వాల్‌పోస్టర్‌ను నిఖిత న్యాయ జేఏసీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగిళ్ల నిఖితది ముమ్మాటికీ హత్యేనని, ఈ విషయంలో ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మరో మంత్రి నిందితులను రక్షిస్తున్నారని, దీనికి స్థానిక ప్రజాప్రతినిధులు కూడా తోడయ్యారని ఆరోపించారు. దళితులను శిక్షించే విషయంలో ముందుండే పోలీసులు దళితులకు జరిగిన అన్యాయం మీద కేసులు నమోదు చేయట్లేదని దుయ్యబట్టారు. బాలిక మృతి చెందినప్పుడు ఆ సమయంలో విధులు నిర్వహించాల్సిన ఏ ఒక్క టీచర్ కూడా అక్కడ లేకపోవడం, బాలిక కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా జాప్యం చేయడంపై అనుమానాలు వ్యక్తం చేశారు. చలో అచ్చంపేట కార్యక్రమానికి వేలాదిగా తరలిరావాలని, అన్ని పార్టీలు, ప్రజా, విద్యార్థి, కులసంఘాలు, వ్యాపార, వాణిజ్య సంఘాల నాయకులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చలో అచ్చంపేట కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణమాదిగ పాల్గొంటారని అన్నారు. కార్యక్రమంలో కోళ్ల శివ మాదిగ, ఎర్రమోని యాదగిరి మాదిగ, సంపంగి మద్దిలేటి, కొండూరు రాముడు, పరమేష్, రమేష్, నర్సింహ, కుర్మయ్య, రాములు, కురుమూర్తి, కిషోర్, ఉదయ్‌కిరణ్, రాజు, వెల్టూరు మద్దిలేటి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ప్రభుత్వం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సింగిరెడ్డి వాసంతి

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని చిన్నమందడి గ్రామానికి చెందిన మాల వెంకటస్వామికి చెందిన గుడిసె మూడు రోజుల క్రితం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. గుడిసెలో వంట సామగ్రితో పాటు బట్టలు, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలిపోయాయి. దీంతో కటుంబం దిక్కుతోచని స్థితిలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. స్థానిక బీఆర్ఎస్ నాయకులు మంత్రి నిరంజన్‌రెడ్డి దృష్టికి బాధితుల సమస్యను తీసుకెళ్లారు. గురువారం మంత్రి నిరంజన్‌రెడ్డి సతీమణి వాసంతి చిన్నమందడికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం వంటసామగ్రి, బట్టలు అందజేయడంతో పాటు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా డబుల్ బెడ్రూం ఇల్లు వచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సంధ్య, ఎంపీడీఓ అఫ్జల్, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు అమద్, ఆర్ఐ తిరుపతయ్య, నాగేంద్రంయాదవ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

జిల్లాస్థాయిలో విద్యార్థి ప్రతిభ

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి వినయ్‌కుమార్ గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఉపన్యాస పోటీలో జిల్లా స్థాయిలో ప్రతిభ చూపి ద్వితీయ బహుమతి సాధించినట్లు పాఠశాల జీహెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏఎంఓ మహానంది ఆధ్వర్యంలో జరిగిన అంబేడ్కర్ జీవిత చరిత్ర యొక్క ఉపన్యాస పోటీల్లో బహుమతి లభించిందన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం జరిగే అంబేడ్కర్ జయంతి ఉత్సవాల్లో విద్యార్థి ఉపన్యాస చేసేందుకు అవకాశం ఉంటుందని హెచ్ఎం పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి ద్వితీయ బహుమతి సాధించడంపై ఎస్ఎంసీ చైర్మన్ పాపన్న, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

అమరచింత: పట్టణంలోని విజేత హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు హస్మిత, మిన్హాస్ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వహించే కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌కి ఎంపిక అయ్యారు. రాష్ట్రంలోనే ఉత్తమమైన గౌలిదొడ్డి క్యాంపస్‌లో ఉచిత రెసిడెన్షియల్ సౌకర్యాలతో నీట్ కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని పాఠశాల కరస్పాండెట్ లక్ష్మీనారాయణ తెలిపారు. గతంలో విజేత హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపిక అయ్యారని, ఈ ఏడాది సైతం ఇద్దరు విద్యార్థినులు ఎంపిక కావడం సంతోషకరమన్నారు.



అమరచింతలో..



పాన్‌గల్‌లో..